క్లుప్తంగా

తిరుమలకు 3,191 ట్రిప్పులు

తిరుపతి అర్బన్: తిరుమల శ్రీవారి బ్రహ్మోత్స వాల్లో రెండవ రోజు శనివారం తెల్లవారిజాము నుంచి అర్ధరాత్రి 12 గంటల వరకు తిరుపతి నుంచి తిరుమలకు 3191 ట్రిప్పులు ఆర్టీసీ సర్వీసులను తిప్పినట్లు జిల్లా ప్రజారవాణా అధికారి చెంగల్‌రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. 91,918 మంది ప్రయాణికులులో ఈ సర్వీసులు ప్రయాణించారని, ప్రధానంగా గరుడోత్సవంతో పాటు పెరటాశి శనివారం పెద్ద ఎత్తున ఆర్టీసీ సర్వీసులు ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

జరిమానా

తిరుమల : గరుడసేవ నేపథ్యంలో తిరుమలలో రోడ్లపై అడ్డదిడ్డంగా పార్కింగ్ చేసిన 28 వాహనాలను ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాల మేరకు వేరే ప్రాంతాలకు తరలించినట్లు తిరుమల ట్రాఫిక్ సీఐ హరిప్రసాద్ తెలిపారు. ఒక్కో వాహనానికి రూ.1270 చొప్పున మొత్తం రూ.35,560 జరిమానా విధించినట్లు చెప్పారు. భక్తులు తమకు కేటాయించిన ప్రాంతాల్లోనే వాహనాలను పార్కింగ్ చేయాలన్నారు.

నేటి నుంచి తపాలా వారోత్సవాలు

తిరుపతి(అలిపిరి): భారత ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 7 నుంచి 11వ తేదీ వరకు తపాలా వారోత్సవాలను నిర్వహించనున్నట్లు జిల్లా పోస్టల్ సూపరింటెండెంట్ బి.నరసప్ప తెలిపారు. వారోత్సవాలలో భాగంగా 7వ తేదీన పోస్టల్ మెయిల్ సర్వీసును ఉపయోగించుకునే వారిని సత్కరిస్తామని, 8న పాఠశాల విద్యార్థులకు స్టాంపుల సేకరణపై అవగాహన కార్యక్రమం, క్విజ్ పోటీలు ఉంటాయన్నారు. 9 నుంచి 11వ తేదీ వరకు నిర్వహించే వివిధ కార్యక్రమాలను తెలియజేశారు.

టైలరింగ్ శిక్షణ



పాకాల: మండలంలోని దామలచెరువు మ్యాంగో నగర్‌లో ఆదివారం టైలరింగ్ ఉచిత శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. లయన్స్ క్లబ్ జిల్లా 317ఈ గవర్నర్ చంద్ర, హెచ్.రెడ్డి, సెకండ్ వైస్ గవర్నర్ ప్రతాప్‌యాదవ్ సహకారంతో క్లబ్ అధ్యక్షుడు పి.నాగూర్ బాషా ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. టైలరింగ్ శిక్షణకు 30 మంది మహిళలు హాజరయ్యారు. మహిళలు శిక్షణతో స్వయం ఉపాధి పొందవచ్చని, తద్వారా కుటుంబానికి చేదోడు వాదోడుగా ఉండవచ్చన్నారు. శిక్షకులుగా జి.మునార్‌బీని నియమించారు. భవిష్యత్ కార్యక్రమాలకు తమ వంతు సహకారం ఇస్తామని చంద్ర చెప్పారు. కార్యక్రమంలో ఏడీసీఎస్ గౌతమ్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, సెక్రటరీ ఆర్వీ నాగూర్, యహసానుల్లా, మాధవిరెడ్డి, కేబీ.ఖాదర్‌బాషా, సతీష్, సైదుల్లా, బషీర్, జేడీ నాగూర్, ఆనందయ్య, ఇమ్రాన్, డీసీలు రామయ్య, కెఎస్.మస్తాన్, ఆర్వీ.ప్రసాద్, కుప్పుస్వామి తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌కో ఏఈఈగా గిరి

రామచంద్రాపురం: మండల ట్రాన్స్‌కో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా గిరి ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఎస్ఆర్‌పురం నుంచి ఆయన ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న రామమూర్తి కార్వేటినగరానికి బదిలీ అయ్యారు. విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడానికి తనవంతు కృషి చేస్తానని గిరి తెలిపారు. కార్యక్రమంలో విద్యుత్‌శాఖ యూనియన్ నాయకులు వెంకటముని, లక్ష్మీపతి, సిబ్బంది జ్యోతి ప్రకాష్, వరాలు, మురగయ్య, గజేంద్ర పాల్గొన్నారు.

ఘనంగా అఖిల భారత తపాలా ఉద్యోగుల ద్వైవార్షిక మహాసభలు

తిరుపతి(అలిపిరి): తిరుపతి డివిజన్ అఖిల భారత తపాలా ఉద్యోగుల గ్రూప్-సి, పోస్ట్‌మ్యాన్-ఎంటీఎస్, ఏఐపీఈయూ యంయంఎస్ ద్వైవార్షిక మహాసభలు తిరుపతి



మాట్లాడుతున్న ఉద్యోగ నేత శ్రీధర్

ఆఫీసర్స్ క్లబ్‌లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి శేషాద్రి, వీరాంజనేయులు అధ్యక్షత వహించారు. రాష్ట్ర కార్యదర్శి శ్రీధర్ బాబు, సిహెచ్. విద్యాసాగర్ కేంద్ర ప్రభుత్వ విధివిధానాలను వివరించారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అఖిల భారత తపాలా ఉద్యోగుల గ్రూప్-సీ సంఘానికి డివిజనల్ ప్రెసిడెంట్‌గా శేషాద్రి, డివిజనల్ కార్యదర్శిగా మధుబా బు, డివిజనల్ ట్రెజరర్‌గా ఏమంత్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పోస్ట్‌మ్యాన్ - ఎంటీఎస్ సంఘానికి డివిజనల్ అధ్యక్షులుగా రమేష్ బాబు, కార్యదర్శిగా మదన్ మోహన్ రెడ్డి, ట్రెజరర్‌గా ప్రసాద్‌ను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. కార్యక్రమంలో జిల్లా తపాలా సూపరింటెండెంట్ నరసప్ప, పలువురు యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

నేడు గ్రీవెన్స్

తిరుపతి తుడా: తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక' (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమాన్ని సోమవారం ఉదయం 10నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించనున్నట్లు కమిషనర్ మౌర్య ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు వినతిపత్రంతో పాటు ఆధార్ కార్డు జెరాక్స్ జతపరచి, పనిచేసే ఫోన్ నంబర్లను పొందుపర్చాలని కోరారు.

బ్రహ్మోత్సవ శోభితం..!



రంగనాయక మండపంలో స్వామివారికి నిర్వహిస్తున్న తిరుమంజన సేవ

తిరుమల: అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకునికి తిరుమలలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాలతో ఎటుచూసినా ఆధ్యాత్మిక శోభ ఉట్టిపడుతోంది. ఆదివారం ఉదయం సింహవాహనం , రాత్రి ముత్యపు పందిరి వాహనసేవల్లో స్వామివారి వైభవాన్ని కీర్తిస్తూ వందలాది మంది వివిధ రాష్ట్రాల కళాకారులు, కళాబృందాల నృత్య ప్రదర్శనలు, వివిధ దేవతామూర్తుల రూపాల్లో ఆద్యంతమూ భక్తి పారవశ్యంలో ముంచెత్తారు. అలాగే, తిరుపతి శ్రీ వేంకటేశ్వర సంగీత నృత్య కళాశాల భరతనాట్యం విభాగం విద్యార్థినులు నృత్యార్చన చేశారు.

ఆధ్యాత్మిక పుస్తకాల ఆవిష్కరణ

సింహ వాహనసేవలో 4 ఆధ్యాత్మిక పుస్తకాలను హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బీవీఎల్ఎ చక్రవర్తి, టీడీ ఈఓ జె.శ్యామలరావు, అదనపు ఈఓ సీహెచ్ వెంకయ్య చౌదరి తదితరులు ఆవిష్కరించారు.

సిబ్బందికి వస్త్ర బహుమానం

శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో సేవలందిస్తున్న వాహన మోతసేవకులు, మేళం సిబ్బంది, శ్రీవారి ఆలయంలో విధులు నిర్వహించే పారిశుద్ధ్య సిబ్బందికి ఆదివారం సేలంకు చెందిన మెక్కినేశ్వరి టెక్స్‌టైల్స్ అధినేత తంగదొరై దంపతులు తిరుమల వైభవోత్సవ మండపంలో టీటీడీ అదనపు ఈఓ సీహెచ్ వెంకయ్య చౌదరి చేతుల మీదుగా వస్త్రాలను అందజేశారు.

తిరుమంజనంలో సేద తీరిన శ్రీవారు

పూటకో వాహనంలో ఊరేగుతూ అలసిన స్వామి సేద తీర్చేందుకు స్నపన తిరుమంజనం నిర్వహించడం సంప్రదాయం. రంగనాయక మండపంలో. జీయర్లు, ఆలయ అర్చకుల నేతత్వంలో శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పను సుగంధ పరిమళ ద్రవ్యాలతో అభిషేకించి, భక్తిప్రపత్తులతో తిరుమంజనసేవ నిర్వహించారు.

నేటి వాహనసేవలు

బ్రహ్మోత్సవాలలో 4వ రోజు సోమవారం ఉదయం శ్రీమలయప్పస్వామివారు ఉభయదేవేరులతో కలిసి కల్పవృక్ష వాహనంపై, రాత్రి శ్రీదేవి, భూదేవి సమేతంగా సర్వభూపాల వాహనంపై భక్తులకు అభయమిస్తారు.



సిబ్బందికి వస్త్ర బహుమానం



స్వామివారి వాహనసేవలో దేవతామూర్తుల వేషధారణలో కళాకారులు, నృత్యం చేస్తున్న కళాకారులు, ఎస్వీ సంగీత నృత్య కళాశాల విద్యార్థిని.., నరసింహావతారంలో భక్తుల ప్రదర్శన

రాష్ట్ర ఉత్తమ అధ్యాపకుల వివరాలను ప్రకటించాలి

తిరుపతి సిటీ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఏటా సెప్టెంబర్ 5వ తేదీన జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ప్రకటించే ఉత్తమ అధ్యాపకుల జాబితాను వెంటనే విడుదల చేయాలని అఖిల భారతీయ రాష్ట్రీయ సైక్సిక్ మహా సంఘం(ఏబీఆర్ఎస్ఎమ్) రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ వైవీ రామిరెడ్డి, ప్రధాన కార్యదర్శి డాక్టర్ గంగినేని రంగనాథ్ విజ్ఞప్తి చేశారు. ఇదే విషయమై ఆదివారం మంత్రి లోకేష్, ఉన్నత విద్యామండలి అధికారులకు వినతి పత్రాలను సమర్పించినట్లు వారు తెలియజేశారు.

ఆకట్టుకున్న ఇంద్రజాల ప్రదర్శన

చంద్రగిరి(తిరుచానూరు): వారాంతపు సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా తిరుచానూరు సమీపంలోని శిల్పారామంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన మ్యాజిక్ షో ప్రేక్షకులను అలరించింది. తిరుపతికి చెందిన ప్రముఖ ఇంద్రజాలకులు నాగార్జున పేపరు నుంచి పావురాన్ని తీయడం, కుందేలును సృష్టించడంతోపాటు కత్తితో పలు విన్యాసాలు చేశారు. అలాగే రుమాలుతో పూలను సృష్టించడం వంటి ప్రదర్శనలను వీక్షించిన నగర వాసులు కరతాళ ధ్వనులతో అభినందించారు. కళాకారులను ఏఓ ఖాదర్‌వల్లీ సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో రాధాకృష్ణ, పప్పి, వరప్రసాద్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.



మ్యాజిక్ షో నిర్వహిస్తున్న మెజీషియన్ నాగరాజు

అన్నపూర్ణగా మూలస్థాన ఎల్లమ్మ కటాక్షం

చంద్రగిరి: చంద్రగిరి గ్రామ దేవత శ్రీమూలస్థాన ఎల్లమ్మదేవి నవరాత్రి ఉత్సవాలలో ఆదివారం అమ్మవారు అన్నపూర్ణ అవతారంలో నంది వాహనంపై కొలువుదీరి భక్తులను కటాక్షించారు. ఉదయం మూలవిరాట్‌తో పాటు అష్టలక్ష్మీదేవతలు, నాగదేవత, నవగ్రహ దేవతలకు ప్రత్యేక పూజలు చేశారు.. అనంతరం మూలమూర్తికి అభిషేక సేవ నిర్వహించారు. తదుపరి అమ్మవారిని పట్టు పీతాంబరాలతో శోభాయమానంగా అలంకరించారు. రాత్రి గజలక్ష్మీ అవతారంలో గజవాహనంపై అమ్మవారు ఆశీనులై పురవీధుల్లో విహరించారు. కార్యక్రమానికి నడింపల్లె గ్రామస్తులు, మొండికాల్వ నాగరాజ నాయుడు, చంద్రగిరి బురిగాల వంశస్తులు, బంగారుపాళ్యంకు చెందిన సుబ్రమణ్యం నాయుడులు ఉభయదాతలుగా వ్యవహరించారు. అనంతరం ఉభయదారులను ఉత్సవ కమిటీ చైర్మన్ మొక్కల చంద్రశేఖర్ రెడ్డి సత్కరించి, అమ్మవారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ మమత, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



నందివాహనంపై విహరిస్తున్న మూలస్థాన ఎల్లమ్మదేవి

టీచర్ భారతికి జాతీయ సేవా అవార్డు



ఉపాధ్యాయిని భారతిని జాతీయ సేవా అవార్డుతో సత్కరిస్తున్న బీఎస్ఏ ప్రతినిధులు

తిరుపతి కల్చరల్: ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో తెలుగు టీచర్, ఎన్‌సీసీ ఆఫీసర్‌గా పని చేస్తున్న సి.భారతికి జాతీయ సమాజ సేవ అవార్డు వరించింది. ఆమె సేవలను గుర్తించి బహుజన సాహిత్య అకాడమీ ఈ అవార్డును ప్రదానం చేసింది. ఆదివారం బైరాగిపట్టెడలోని గంధమనేని శివయ్య భవన్‌లో జరిగిన బహుజన సాహిత్య అకాడమీ దక్షిణాది రాష్ట్రాల సమావేశంలో ఆ సంస్థ జాతీయ అధ్యక్షుడు నల్లమల్ల రాధాకృష్ణ ఆమెకు అవార్డును ప్రదానం చేసి సత్కరించారు. సహచర ఉపాధ్యాయులు ఆమెను అభినందించారు.

బగళాముఖిదేవిగా దుర్గాదేవి

రామచంద్రాపురం: మండలంలో రాయలచెరువు కట్ట సమీపంలోని శ్రీ శక్తి పీఠంలో శ్రీ దశ మహా విద్యా దివ్యోత్సవాల్లో భాగంగా ఆలయ ప్రాంగణంలోని దుర్గాదేవి శ్రీ బగళాముఖిదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీ శక్తిపీఠ వ్యవస్థాపకులు శ్రీ సిద్ధేశ్వరానందభారతీ స్వామి, మాతాజీ రమ్యానంద భారతి శ్రీ అమ్మవారిని వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి, అభిషేకాలు, పూజలు, హోమం, స్త్రీమూర్తులకు సువాసినీ పూజ చేశారు. సూరావారిపల్లె సమీపంలోని సురభి గోసంరక్షణశాలలో దుర్గాదేవి అన్నపూర్ణాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

అన్నపూర్ణదేవిగా కరిమారియమ్మ

తిరుపతి రూరల్: తిరుపతి రూరల్ మండలం పేరూరు పంచాయతీలోని కరిమారియమ్మ ఆలయంలో ఆదివారం అమ్మవారు అన్నపూర్ణదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ధర్మకర్త, సర్పంచ్ దామినేటి కేశవులు ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. అలాగే తుమ్మలగుంటలోని శ్రీశక్తి చాముండేశ్వరి అమ్మవారు అన్నపూర్ణదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. మధ్యాహ్నం డాలర్ దివాకర్‌రెడ్డి, నరసింహాయాదవ్, ఆలయ ధర్మకర్త బిరుదాల భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.

మహిషాసురమర్దినిగా బొంతాలమ్మ

తిరుపతి మంగళం: మంగళం రోడ్డులోని శ్రీబొంతాలమ్మ ఆలయంలో ఆదివారం సాయంత్రం అమ్మవారు శ్రీమహిషాసుర మర్దిని అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

అన్నపూర్ణదేవిగా గంగమ్మ దర్శనం

తిరుపతి కల్చరల్: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం తాతయ్యగుంట గంగమ్మ అన్నపూర్ణదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి ఆలయంలో అమ్మవారికి ఉయ్యాలసేవ నిర్వహించారు.



శ్రీ బగళాముఖిదేవి అలంకరణలో అమ్మవారు



శ్రీమహిషాసుర మర్దిని అలంకరణలో దర్శనమిస్తున్న బొంతాలమ్మ



అన్నపూర్ణదేవి అలంకరణలో దర్శనమిస్తున్న తాతయ్యగుంట గంగమ్మ

● గొడుగుల సమర్పణ



గొడుగులు అందజేస్తున్న దాత కుటుంబ సభ్యులు

తిరుపతి కల్చరల్: తిరుపతి గ్రామదేవత శ్రీతాతయ్యగుంట గంగమ్మకు తిరుపతికి చెందిన వేలూరు కుసుమమ్మ కుటుంబ సభ్యులు ఆదివారం రెండు గొడుగులను సమర్పించారు. తాతానగర్‌లోని తమ స్వగృహంలో గొడుగులకు ప్రత్యేక పూజల అనంతరం మేళతాళాల మధ్య ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని ప్రదక్షిణలు చేసి ఈఓ ఏ.జయకుమార్‌కు గొడుగులను అందజేశారు. రూ.20 వేల విలువైన గొడుగులను చెన్నైలో ప్రత్యేకంగా తయారు చేసించినట్లు కుసుమమ్మ తెలిపారు. కార్యక్రమంలో దాత కుటుంబ సభ్యులు కల్యాణి, కుమారి, జానకి, అన్నపూర్ణమ్మ, రంగస్థలి చైర్మన్ గుండాల గోపినాథ్‌రెడ్డి, కేఎన్.రాజా, చిత్రపు హనుమంతరావు, కస్పా పద్మనాభం, వాసు, రాజశేఖర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, పొన్నాల జేజిరెడ్డి, ధనంజయ రెడ్డి, వెంకటాద్రి పాల్గొన్నారు.

భారత రాజ్యాంగాన్ని అందరూ చదవాలి



జోహార్లు అర్పిస్తున్న నాయకులు

పాకాల: దేశ ప్రజలందరూ భారత రాజ్యాంగాన్ని చదవాలని స్థానిక అంబేడ్కర్ భవన్ అధ్యక్షుడు గుండ్లపల్లి ఆంజనేయులు కోరారు. ఆదివారం స్థానిక పాకాల శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి తాళ్ల రవీంద్రబాబు ఆధ్వర్యంలో గ్రంథాలయంలో ×భారత రాజ్యాంగం పరిరక్షణ₹ అనే అంశంపై అధ్యయన తరగతులు నిర్వహించారు. అధ్యక్షత వహించి ఆంజనేయులు మాట్లాడారు. భారత రాజ్యాంగ ప్రతులను అన్ని గ్రంథాలయాల్లో ఉంచాలని కోరారు. గ్రంథాలయాధికారి మాట్లాడుతూ, అంబేడ్కర్ రోజుకు 18 గంటలు పుస్తకాలను చదివేవారని, అందుకే ఆయన ప్రపంచ మేధావి అయ్యారన్నారు. అనంతరం అంబేడ్కర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి జోహార్లు అర్పించారు. కార్యక్రమంలో విజయమోహన్ రెడ్డెప్ప, ఆదికేశవులు, ప్రభు, జ్యోతప్రసాద్, వెంకటరత్నం, బాలసుబ్రమణ్యం, శివప్రసాద్, మధుబాబు, దొరస్వామి, మునిరాజా తదితరులు పాల్గొన్నారు.

మాటల కంటే రాతలే గొప్పవి

- 'జక్కదొన' పుస్తకావిష్కరణలో తెలంగాణ ప్రభుత్వ సలహాదారు శ్రీనివాసరాజు

తిరుపతి సిటీ: ప్రసిద్ధ రచయిత ఆర్‌సి కృష్ణస్వామి రాజు రచించిన జక్కదొన కథా సంపుటి ఆవిష్కరణ కార్యక్రమం ఆదివారం ఎస్వీయూ సెనేట్ హాల్‌లో నిర్వహించారు. ఎస్వీయూ ప్రాచ్య పరిశోధన సంస్థ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. తెలంగాణ ప్రభుత్వ సలహాదారు కేఎస్ శ్రీనివాసరాజు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కృష్ణస్వామి రాజు తాను పుట్టి పెరిగిన చిత్తూరు జిల్లా సామాజిక మూలాలను అక్షర రూపంలో నిక్షిప్తం చేసిన గొప్ప రచయితని, మాటలకంటే రాతలే గొప్పవని అనుభవాలను కథల రూపంలో సాహితీ లోకానికి అందిస్తున్న రచయితలు అభినందనీయులన్నారు. ప్రాచ్య పరిశోధనా సంస్థ సంచాలకులు ప్రొఫెసర్ వీసీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, ఆర్సీ కృష్ణస్వామి రాజు ఇప్పటివరకు 450 కథలను రాశారని, ప్రతి కథ పాఠకుణ్ణి చదివిస్తుందన్నారు. ఆయన రాసిన కథల మీద ఉన్నత విద్యామండలి ×గాండ్లమిట్ట₹ కథా సంపుటిపై టాక్ ఆఫ్ ద బుక్ కార్యక్రమం నిర్వహించిందని గుర్తుచేశారు. అనంతరం జక్కనదొన కథాసంపుటిని ముఖ్యఅతిథులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో పుస్తక రచయితతోపాటు వీసీ సీ హెచ్ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతినాయుడు, చెన్నై ప్రొఫెసర్ ఎలిజబెత్ జయకుమారి, గరికపాటి రమేష్‌బాబు, నెమిలేటి కిట్టన్న, సాకం నాగరాజు, సత్యనారాయణ, మల్లేశ్వరరావు, గ్రంథాలయ విశ్రాంత ఉద్యోగి షణ్ముగం, రచయితలు పాల్గొన్నారు.



జక్కదొనను ఆవిష్కరిస్తున్న ముఖ్యఅతిథులు

మా భూమిని ఆక్రమించారు.. న్యాయం చేయరూ!



మాట్లాడుతున్న బాధితురాలు గుర్రమ్మ

తిరుపతి కల్చరల్: మంగళం హరిజన వాడలోని గ్రామ కంఠం, సర్వే నంబర్ 1522లోని 6 సెంట్ల తమ భూమిని ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని బాధితురాలు పి.గుర్రమ్మ విజ్ఞప్తి చేశారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. 2005లో తన నానమ్మ వెంకటమ్మ దాన సెటిల్‌మెంట్‌గా 6 సెంట్ల భూమిని రాసిచ్చిందని, అయితే కోడూరు వాస్తవ్యుడు, ప్రస్తుతం తిరుపతిలో నివాసం ఉంటున్న గిరిధర్‌రెడ్డి 15 ఏళ్లుగా తమ స్వాధీనంలో ఉన్న భూమిని గత నెల 24న సుమారు 30 మందికిపైగా మనుషులను తీసుకొచ్చి తమ ఇంటిని ఎవరూ లేని సమయంలో కూల్చి వేశారని, స్థల వివాదం కోర్టులో నడుస్తుండగా ఇలా దౌర్జన్యంగా ఇంటిని కూల్చివేసి ఆక్రమించుకున్నాడని వాపోయారు. పైగా, నాని, జేబీ పేరు చెబుతూ, బెదిరిస్తున్నాడని, పోలీసులను ఆశ్రయించినా ఆక్రమణదారులకే మద్దతుగా నిలుస్తున్నారని తెలిపింది. జిల్లా ఉన్నతాధికారులైనా తమకు న్యాయం చేయాలని కోరింది. సమావేశంలో నారయ్య, వినోద్‌కుమార్, కోకిల, చిన్నమ్మ పాల్గొన్నారు.

బజాజ్ కొత్త ఫ్రీడమ్-125 మోటార్ సైకిళ్లు లాంచింగ్

తిరుపతి కల్చరల్: తిరుపతి మార్కెట్‌లోకి అత్యాధునిక బజాజ్ ఫ్రీడమ్-125, సీసీడ్రమ్ మోటార్ సైకిళ్లను విడుదల చేశారు. స్థానిక ఎయిర్ బైపాస్ రోడ్డులోని ఎంబీజీ బజాజ్ షోరూంలో ఆదివారం వీటిని యూనియన్ బ్యాంక్ మేనేజర్ కెఎల్.సందీప్, ఏజీపీ సీఎన్‌సీ కంపెనీ రీజినల్ హెడ్ గౌతమ్ ఆనంద్, టూవీలర్స్ మెకానిక్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏ.మునిరెడ్డి చేతుల ఆవిష్కరించారు. ఎంజీబీ ఏజీఎం శ్రీనివాస్ మాట్లాడుతూ, పెట్రోల్ మోటార్ సైకిల్‌తో పోలిస్తే బజాజ్ ఫ్రీడమ్ సీఎన్‌జీ మోటార్ సైకిల్‌తో 50 శాతం ఖర్చు ఆదా అవుతుందని, ఈ మోటార్ సైకిళ్ల గ్యాస్, పెట్రోల్‌తో నడిచేలా రెండు ఆప్షన్స్ ఉండటం ప్రత్యేకత అని, ఇవి ఐదు రంగులలో లభిస్తాయని చెప్పారు. రీజినల్ హెడ్ గౌతమ్ ఆనంద్ మాట్లాడుతూ, చిత్తూరు జిల్లాలో 16 సీఎన్‌జీ పంప్ స్టేషన్లున్నాయని, మరిన్ని త్వరలో రాబోతున్నాయని తెలిపారు. మురళీ కృష్ణ, రాజగోపాల్‌రెడ్డి, షోరూం సిబ్బంది పాల్గొన్నారు.



బజాజ్ ఫ్రీడమ్-125, సీసీడ్రమ్ బైక్స్‌ను ఆవిష్కరిస్తున్న అతిథులు, షోరూం ప్రతినిధులు

దేదీప్యం.. దేవతామూర్తుల రూపం



తుమ్మలగుంటలో ఏర్పాటు చేసిన విద్యుద్దీపాల దేవతామూర్తుల కటౌట్లు





తిరుపతి రూరల్: తుమ్మలగుంట శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. శ్రీవారి ఆలయంతో పాటు గ్రామ శివార్లలో ఏర్పాటు చేసిన విద్యుద్దీపాల కాంతులతో దేదీప్యమానంగా విరాజిల్లుతోంది. ప్రధానంగా శ్రీమన్నారాయణుని దశావతారాల విద్యుత్ కటౌట్లు భక్తులను ఇట్టే ఆకర్షిస్తున్నాయి. తుమ్మలగుంటకు వచ్చే అన్ని దారులు విద్యుద్దీప కాంతులతో సరికొత్త కాంతులీనుతున్నాయి. ప్రతి ఏటా తిరుమల తరహాలో తుమ్మలగుంట శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామికి బ్రహ్మోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా పెట్టుకున్నారు చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి. అందులో భాగంగానే భక్తులను ఆకట్టుకునేలా దీపాలంకరణను చేయించారు.